ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 7 జూన్ 2024

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కొరత 8లో..

వేగంగా సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులు 7లో..

ముగిసిన 'కోడ్'



- సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారుల నిరీక్షణ
- ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ అందక ఇక్కట్లు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు
- అభివృద్ధి పనుల్లో వేగం పెరిగేనా?
- రైతు బంధు ఇస్తారా లేక రైతు భరోసానా?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అడ్డుగా మారిన పార్లమెంట్ ఎన్నికల కోడ్ గురువారం నాటితో ముగిసింది. మూడు మాసాలుగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఎంపిక, ఇప్పటివరకు అమలవుతున్న పథకాలకు సంబంధించిన చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కోడ్ ముగియడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఆశలు పెట్టుకున్న ప్రజలు అవి ఏ మేరకు తమకు దక్కుతాయోనని ఎదురు చూస్తున్నారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 8వ తేదీన విడుదల చేసింది.

అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ పరంగా కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టడానికి, కొత్తగా సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకరావడానికి అవకాశం లేకుండాపోయింది. ఈ ఎన్నికలు దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో నిర్వహించారు. ఈనెల నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించారు. గురువారం సాయంత్రం ఎన్నికల కోడ్ ముగిసింది. ఈనెల ఏడవ తేదీ నుంచి ఆయా ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయ్యింది. ఆరు మాసాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తాము గెలిస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, మరో 11 మంది మంత్రులతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాల అమలుపై దృష్టి సారించింది. 9వ తేదీన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే పథకాన్ని ప్రారంభించారు.

అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అప్పటి వరకు 5 లక్షల రూపాయల వరకు అందిస్తున్న ఉచిత వైద్యాన్ని 10 లక్షల రూపాయలకు పెంచగా, ఆ పథకాన్ని కూడా అదే రోజు నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఆ తర్వాత మార్చి మొదటి వారంలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించే పథకంతో పాటు, 500 రూపా యలకే సబ్సిడీ గ్యాస్ అందించే పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు జిల్లాకు చెందిన మహిళలు 88.56 లక్షల టికెట్లపై ప్రయాణించారు. గృహలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 1,10,346 విద్యుత్ కనెక్షన్లు గల కుటుంబాలకు ఇప్పటివరకు 7 కోట్ల 68 లక్షల రూపాయల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. అలాగే సబ్సిడీ వంట గ్యాస్‌కు సంబంధించి 96,500 కుటుంబాలకు చెందిన వారికి సబ్సిడీని అందజేస్తున్నారు.

వారం రోజుల్లోనే కోడ్ అమలు..

అయితే ఈ రెండు పథకాలను అమల్లోకి తీసుకువచ్చిన వారం రోజుల్లోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోని కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే ఒక ఇంట్లో రెండు మీటర్లు ఉంటే రెండు మీటర్ల నంబర్‌లను దరఖాస్తులో పేర్కొనడంతో విద్యుత్ సిబ్బంది యాప్‌లో రెండింటిని నమోదు చేశారు. ఆయా మీటర్లలో ఏదైతే తక్కువ బిల్లు వస్తుందో దానికి ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేశారు. అంతకంటే కాస్త ఎక్కువ బిల్లు వచ్చే మీటర్‌కు ఈ పథకాన్ని వర్తింప చేసేందుకు ఎడిట్ ఆప్షన్ కోడ్ వల్ల ఇవ్వ లేదు. అలాగే చాలామందికి సబ్సిడీ గ్యాస్ ఇప్పటివరకు పడడం లేదు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి చెక్ చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వీటిని పరిష్కరించుకునేందుకు ఎన్నికల కోడ్‌ను ఎప్పుడు ఎత్తివేస్తారా అని ఎదురుచూస్తున్నారు. అలాగే గత ప్రభుత్వం అమలు చేసిన విధంగా రైతుబంధు ద్వారా యాసంగి సాగుకు 1,48,775 మంది రైతులకు సుమారు 132 కోట్ల సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది.

వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా పథకం కింద ఎకరానికి 7500, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఏడాదికి 12000 చొప్పున అందజేస్తుందా, లేక పాత పథకాన్ని కొనసాగిస్తుందో తెలియడం లేదు. ఎన్నికల కోడ్ వల్ల ఈ పథకం గురించి ఎక్కడ కూడా ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ప్రకటన చేయలేదు. అలాగే మార్చి నెలలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి భద్రాచలంలో నిర్వహించిన సభ ద్వారా ఆరంభించారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినప్పటికీ అవి కొందరికి మాత్రమే అందాయి. చాలా చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పథకం ఫెయిల్ కావడంతో అనేక మంది పేదలు ఇళ్లు నిర్మించుకోలేక పోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి ఐదు లక్షల ఇస్తామని ప్రకటించింది.

ఈ పథకం ద్వారా ఎప్పుడు లబ్ధిదారులను ఎంపిక చేస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 10 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలను అనుసరించి ఎమ్మెల్యేలు, ఇన్చార్జి మంత్రుల ద్వారా ప్రతిపాదనలను పంపగా అవి ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఇవేగాకుండా వివిధ గ్రాంట్ల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కోడ్ ముగియడంతో అభివృద్ధి సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-2కు గ్రీన్ సిగ్నల్

- 800 మెగావాట్ల 3 యూనిట్ల నిర్మాణం
- అంతర్జాతీయ బిడ్డింగ్ కోసం ఎన్టీపీసీ ప్రకటన
- రూ 27 వేల కోట్లతో టిఎస్‌టిపిపి రెండో దశ నిర్మాణం


స్టేజ్ 2 ప్రాజెక్టు కోసం సాయిల్ పరీక్షలు నిర్వహించిన ప్రదేశం

జ్యోతినగర్, జూన్ 6 : రామగుండంలో నిర్మించనున్న 2400 మెగాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టిపిపి) స్టేజ్ 2కు గ్రీన్ సిగ్నల్ లభించింది. 800 మెగవాట్ల 3 యనిట్లను రెండో దశలో నిర్మించనున్నారు. స్టేజ్ 2 కోసం అన్ని వనరులున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) జరగకపోవడంతో నిర్మాణంలో జాప్యం జరిగింది. అయితే పీపీఏ జరుగకున్నప్పటికీ కొన్ని రోజుల క్రితం 2400 మెగావాట్ల రెండో దశ నిర్మాణంకు సంబంధించి ఎన్టీపీసీ సాయిల్ టెస్ట్‌తోపాటు ఇతర ప్రాథమిక పనులను చేపట్టింది. ఈ నేపథ్యంలో స్టేజ్ 2కు సంబంధించి ఎన్టీపీసీ కార్పొరేట్ కాంట్రాక్ట్ విభాగం తాజాగా ఈప్రాజెక్టు కోసం అంతర్జాతీయ బిడ్డింగ్‌ను ఆహ్వానించింది. ఈపీసీ(ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) టెండర్లను పిలుస్తూ గత మంగళవారం(04-06-2024) ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా రామగుండంలోని టీఎస్‌టీపీపీ స్టేజ్2తోపాటు మరో 3 ప్రాజెక్టులకు(8,800 మెగావాట్లు) ఈపీసీ టెండర్లను పిలిచింది. 2016లో పునాదిరాయి పడిన టీఎస్‌టీపీపీ స్టేజ్1లో 800 మెగావాట్ల రెండు యూనిట్ల నిర్మాణం పూర్తయి తెలంగాణకు 85శాతం విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. స్టేజ్1ను రెండు నెలల క్రితమే ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

స్టేజ్-2కు అంకురార్పణ..

స్టేజ్2లో నిర్మించే 800 మెగావాట్ల 3 యూనిట్లకు సంబంధించి గతంలోనే భూసార పరీక్షలు(సాయిల్ టెస్ట్) పనులు ఎన్టీపీసీ చేపట్టింది. సుమారు 27 వేల కోట్ల రూపాయల వ్యయంతో రెండో దశ ప్రాజెక్టును నిర్మించనున్నారు. స్టేజ్ 2 ప్రస్తుత 1600 మెగావాట్ల మొదటి దశ ప్రాజెక్టు పక్కనే ఉన్న స్థలంలోనే నిర్మించనున్నారు. స్టేజ్ 1,2 కోసం సుమారు 700ఎకరాల స్థలాన్నిపాత రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు పక్కనే కేటాయించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌టీపీపీ రెండో దశకు సంబంధించి పీపీఏ కుదుర్చుకునే విషయంలో అనాసక్తి చూపుతున్నది. గతంలో అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కారు సైతం స్టేజ్ 2 విషయంలో ఆసక్తి కనబర్చలేదు. పీపీఏ ఒప్పందం లేకుండానే ప్రాజెక్టు నిర్మాణానికి అంతర్జాతీయ బిడ్డింగులను పిలవడం కొంత చర్చనీయాంశం అవుతున్నది.

విభజన చట్టం ప్రకారం 4 వేల మెగావాట్లు..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఎన్టీపీసీ తెలంగాణలో 4000 మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాలని పేర్కొంది. దీంతో రామగుండంలోనే 4 వేల మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్టీపీసీ నిర్ణయించి 2015లో ప్రక్రియ ప్రారంభించింది. 2016లో ఈ ప్రాజెక్టు స్టేజ్ 1కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. మొదటి దశ 1600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తికాగా, 2400 మెగావాట్ల స్టేజ్ 2కు ఎట్టకేలకు అడ్డంకులు తొలగిపోయి టెండర్ల దశకు వచ్చింది.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు?

మంథని, జూన్6: గంజాయి విక్రయదారులు,సేవించే పలువురిని మంథని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మంథనిలోని పలు ప్రాంతాలతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు, మైనర్లు మంథనిలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విక్రయదారుల నుంచి కొంతమేర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి విక్రయాల వెనుక ఎవరున్నారు, గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనే వంటి అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేక బృందాలతో గంజాయి విక్రయాల ప్రదేశాలపై గాలింపు చర్యలు సైతం నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ప్రజా ఆశీర్వాదంతోనే కేంద్రంలో మరోసారి అధికారం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని, జూన్6: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీని ఆశీర్వాదించడంతో ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో మూడోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. గురువారం సునీల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ మళ్లీ ప్రధానిగా ఎన్నిక కావడం శుభసూచకం, మరింత బాధ్యతగా దేశాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ సత్తా చాటిందని, కాంగ్రెస్‌కి రాష్ట్రంలో గట్టి పోటీనిచ్చే బీజేపీ అని మరోసారి ప్రజలు గ్రహించి 8 ఎంపీ సీట్లు ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే బీజేపీ రాష్ట్రంలో మరింత పుంజుకుందన్నారు. దేశంలో రాజకీయాలు చేస్తానని, విర్రవీగిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఉనికి లేకుండాపోయిందని, ఒక సీటు రాకుండా కొట్టుకుపోయిందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ రాష్ట్రంలో కూడా అధికారం లోకి వస్తుందనడానికి పార్లమెంట్ ఎన్నికలే నిదర్శనమన్నారు. పెద్దపెల్లి పార్లమెంట్లో కూడా కాంగ్రెస్ పార్టీకి బీజేపీ గట్టి పోటీనిచ్చిందని, కాంగ్రెస్ జూట హామీలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మూడోసారి ప్రధాని కాబోతున్న నరేంద్రమోదీకి, రాష్ట్రంలో గెలుపొందిన పార్లమెంట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మంథని నియోజకవర్గ అసెంబ్లీ కో-కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, నేతలు బోగోజు శ్రీనివాస్, రాపర్తి సంతోష్, కోరబోయిన మల్లికార్జున్, ఓజ్జల మురళి కృష్ణలు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో బీజేపీ సంబరాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూన్ 6: దేశంలో బీజేపీ గెలుపొందడాన్ని హర్షిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో బీజేపీకి నీరాజనం పట్టారని, మోదీ కా పరివార్, ఉపాధిహామీ పథకాలు ప్రజల్లో విస్తృతంగా వెళ్లాయని, గడపగడపకు శ్రీరాముని అక్షింతలు వెళ్లాయని, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్, నాయకులు గాండ్ల ధర్మపురి, కోమళ్ల మహేష్, సుల్వ లక్ష్మీనర్సయ్య, తోట కుమారస్వామి, సుమంత్, కొండపర్తి సంజీవ్, కోడూరి రమేష్, భూమయ్య, గట్టయ్య, స్వామి, గోపగోని నవీన్, సతీష్ పాల్గొన్నారు.

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

సుల్తానాబాద్, జూన్ 6: సుల్తానాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో గురువారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్, పలువురు సిబ్బందితో కలిసి హోటళ్లలో తనిఖీలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో హోటళ్లను, టిఫిన్‌సెంటర్లను, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగలు రాకుండా కుళ్లిన పదార్థాలు నిలువ ఉంచకుండా చూడాలని సూచించామన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. హోటళ్లలో వ్యర్థ పదార్థాలను నిలువ ఉంచరాదని, చెత్తను ఎప్పటికపుడు మున్సిపాలిటీ చెత్త బండి వారికి అప్పగించాలని, పరిశుభ్రంగా ఉంచనివారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపుల నిర్వహణలో వలంటీర్ల పాత్ర ప్రశంసనీయం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - ప్రశంసా పత్రాల అందజేత


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిటౌన్, జూన్ 6: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వేసవి కాలంలో విజయవంతంగా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడంలో వలంటీర్లుగా పనిచేసిన విద్యార్థులు చేసిన కృషి ప్రశంసనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా క్యాంపులను నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన పిల్లల సందడి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ దేఖో బృందం ఆధ్వర్యంలో మార్చి 25నుంచి జూన్ 30వరకు 30 గ్రామాల్లో విస్తృతంగా విద్యార్థులు వలంటీర్లుగా పనిచేస్తూ చిన్నారులకు సమ్మర్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించారన్నారు. ప్రపంచంలో ఎవరూ శాశ్వతం కాదని, మానవ జీవితం చాలా స్వల్పకాలం ఉంటుందని,మనం చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని, ఆ దిశగా నేడు వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులకు సమ్మర్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమని కలెక్టర్ కొనియాడారు. వలంటీర్‌గా సమ్మర్ క్యాంపులు నిర్వహించిన ప్రతి విద్యార్థి దాదాపు 20మంది చిన్నారులపై తమ ప్రభావం చూపారని పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధి, విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది దేశంలో ఉన్న అసమానతలను తగ్గిస్తుందన్నారు. ప్రస్తుతం వలంటీర్లు ప్రారంభించిన ఈ స్ఫూర్తి కొనసాగే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో ప్రతివారం గ్రామీణ ప్రాంతంలో చిన్నారులతో విద్యార్థులు క్యాంపులు నిర్వహించేలా డిస్ట్రిక్ట్ ఫెలోషిప్ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామన్నారు. 2011 సమయంలో తాను 2 నెలల పాటు వాలంటీర్‌గా పనిచేసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తరగతులు తీసుకోవడం జరిగిందని, ఆ విద్యార్థులతో గడిపిన సమయం, ఆ అనుభవాలు జ్ఞాపకం ఉన్నాయని, అదేవిధంగా ఈ సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం వలంటీర్లుగా పని చేసి సమ్మర్ క్యాంపులు నిర్వహించిన విద్యార్థులను సన్మానించి, ప్రశంసిస్తూ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాల అకడమిక్ అధికారి డాక్టర్ పీఎం షేక్, భారత్ దేఖో బృందం సభ్యులు అస్ర ఫాతిమా, గణేష్ గుడల, మహమ్మద్ మెహరీన్, వై.కోమల్, శ్రీవాణి, మీనాక్షి, విద్యార్థులు, వలంటీర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన

- 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహణ - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్


చిన్నారులకు అడ్మిషన్ ఫాంలు అందజేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దబొంకూర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, ప్రతిఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, విద్యార్థులకు అర్థమయ్యే దిశగా కొత్త బోధనా పద్ధతులను అమలుచేస్తున్నామన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, దీని ఫలితంగా ఇటీవలే వచ్చిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 97 శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను సాధిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్‌గా ప్రతి నెల పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నా మని, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలు విఫలమైన చంద్రయాన్ ప్రయోగాన్ని భారత శాస్త్రవేత్తలు విజయవంతం చేశారని, అటువంటి శాస్త్రవేత్తలు సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్, పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ పాఠశాలల్లోని విద్యార్థులతో సంభాషిస్తూ వారు పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి మాట్లాడుతూ 19వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ముఖ్యమైన పాఠ్యాంశాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ కార్నర్లను ఏర్పాటు చేశామని, గ్రంథాలయంలో విద్యార్థుల కోసం మంచి కథల పుస్తకాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని, అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పి డబ్బు వృధా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఐఐటి, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారని, క్రీడా పోటీలలో సైతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధికంగా రాణిస్తున్నారన్నారు. పాఠశాల అకడమిక్ అధికారి డాక్టర్ పి.ఎం. షేక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు, ఆటస్థలం అందుబాటులో ఉన్నాయని, నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరుతున్న విద్యార్థులకు అడ్మిషన్ ఫారం అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సమత, అడిషనల్ డీఆర్డీవో రవికుమార్, ఏపీఎం సంపత్, ఏపీవో రమేష్‌బాబు, అంగన్వాడీ టీచర్స్ సుధా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్6: మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రేణికుంట గ్రామం వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకరి అదృశ్యం

మానకొండూర్, జూన్ 6: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన యాళ్ళ శ్యాంసుందర్‌రెడ్డి ((44) అనే కారు డ్రైవర్ అదృశ్యం అయినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ముంజంపల్లికి చెందిన శ్యాంసుందర్‌రెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తు ఆన్‌లైన్ ఆటలు ఆడుతుండే వాడని, దీంతో భార్య జమున మందలించిందని తెలిపారు. దీంతో ఈ నెల 1నుంచి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అప్పటి నుంచి భర్త ఆచూకీ లేదని గురువారం భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- రూ. 6లక్షల నగదు, మూడు వాహనాలు స్వాధీనం

మెట్‌పల్లి, జూన్, 6 : మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దొంగను అరెస్టు చేసి, రూ. 6లక్షల నగదు, మూడు వాహనా లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆటో నడపడం ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు, మద్యానికి, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగా మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో గత కొంత కాలం నుంచి హండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడుతు న్నాడు. దొంగి లించిన వాహనాలను నిజామాబాద్, ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, గంగాధర పరిధి లోని గ్రామాల్లోని వారికి తక్కువ ధరకు విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నాడు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో మెట్‌పల్లి సీఐ, ఎస్సైలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం మెట్‌పల్లి పాతబస్టాండ్ సమీపంలో ఎస్సై తన సిబ్బంతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో షేక్ ఇస్మాయిల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

నిందితుడు దొంగిలించిన వాహనాలను స్క్రాప్‌గా చేసి విక్రయించగా వచ్చిన రూ.6ల క్షల నగదు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన 16మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకున్న సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, ఏఎస్సై బేగ్, అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, సిబ్బంది కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో
యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్ 6: మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్(19) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్ ఆరు నెలల క్రింతం గల్ఫ్ దేశం దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి పనిలేక డబ్బులు లేక చేసిన అప్పులు తీర్చలేక తాగుడుకు బానిస య్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. హైదరా బాద్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రె డ్డితో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు పీఆర్‌టీయూ నాయకులు కలిశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, జీవో 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల ని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్లా శ్రీధర్, నాయకులు రాజు జాదవ్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, జూన్ 6: రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ గురువారం అరెస్టు వివరాలను సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా కర్లపాడెం మండల కేంద్రానికి చెందిన ఖాజా, ఖమ్మంకు చెందిన వాసు ముగ్గురు కలిసి కొంత కాలంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు మోస్ట్ వాంటెడ్ వ్యక్తులుగా మారారన్నారు. కోటేశ్వర్ గతంలో జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడ మిగతా ఇద్దరు కలిసి జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలకు పాల్పడే వారని వివరించారు. తెలంగాణలోని ఓ గ్రామంలో దొంగతనం చేసి వెంటనే ఆంధ్ర ప్రదేశ్‌లో కానీ ఇతర జిల్లాల్లో గానీ తలదాచుకుంటారని, ఏపీలో ఒక చోరికి పాల్పడి ఆ వెంటనే జిల్లాలను మారుస్తారని, అవసరమైతే రాష్ట్రాలను కూడా మారుస్తారన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని ఖమ్మంతో పాటు మంచిర్యాల జిల్లా, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల్లో అనేక చోరీలకు పాల్పడ్డారని, తాజాగా సుల్తానాబాద్ సర్కిల్ పరిధి పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దాంతో పెద్దపల్లి పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి ఈ దొంగల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ల నుంచి వివరాలు సేకరించగా వీరు పాత నేరస్తులుగా తేలిందని, ఆ కోణంలో వారి కోసం వేట కొనసాగించగా ముగ్గురు దొంగలను పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి లక్షా డెబ్బై వేల నగదు, తొమ్మిదిన్నర లక్షల విలువ చేసే పదమూడు తులాల ఆరు గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ పల్సర్ బైక్‌ను వీరు చోరీ చేశారన్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి, జూలపల్లి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తిరుపతి, రత్నాకర్, సుధాకర్, రమేష్, రాజు తదితరులను అభినందిస్తూ వారికి నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

సౌదీలో వేంపల్లి వాసి ఆత్మహత్య


వెంకటి(ఫైల్)

మల్లాపూర్, జూన్, 6: ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కందెల వెంకటి(41) అనే వలస కార్మికుడు అప్పుల బాధతో సౌదీ అరేబియాలోని తన గదిలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేంపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కందెల వెంకటి చిన్నతనంలో తండ్రి రాజన్న మృతిచెందగా రేకుల షెడ్‌లో ఉంటూ తల్లి గంగరాజు కొద్ది పాటి భూమిలో వ్యవసాయం చేసు కుంటూ పిల్లలను పెంచి పెద్ద చేసింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో పెద్దకుమారుడైన వెంకటి అప్పు చేసి ఇరువై ఏళ్ల నుంచి పలు గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. కొంత కాలం క్రితం పెళ్లి చేసుకోగా ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. చేసిన అప్పులు తీర్చడానికి సౌదీ అరేబియాలోని ఓ షేక్ వద్ద గొర్లు మేపేందుకు జీతం కుదుర్చుకున్నాడు. వచ్చిన జీతం కుటుంబ పోషణకు, ఖర్చులకు సరిపోతుండడంతో చేసిన అప్పులు తీర్చలేననే బెంగతో కుమిలిపోతుండే వాడని బంధువులు, స్నేహితులు తెలిపారు. గురువారం పనులు ముగించుకుని తన రూమ్‌కు వచ్చిన తర్వాత ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటి మృతి చెందినట్లు స్నేహితులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతి వార్త విన్న కుటుంబీకులు తీవ్రంగా విలపించారు. వెంకటి మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

ధర్మారం, జూన్ 6: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో గురువారం ట్రాక్టర్ ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. గురువారం ఉదయం మ్యాన ప్రభాకర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌ను వెనుకకు నడపడం వలన అతడి మనమడు మ్యాన వేదన్ష్(4) తీవ్ర గాయాలై మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాలుడి తండ్రి మ్యాన ఓంకార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

సైదాపూర్, జూన్ 6: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామానికి చెందిన మొలుగూరి పోచయ్య అనే రైతుకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య నారు మడికి నీరు పెట్టేందుకు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి వద్దకు కరంటు సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరి చేస్తుండగా షాక్‌కు గురై గాయపడ్డాడు. సమాచారం మేరకు కుటుంబసభ్యులు పోచయ్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

వేగంగా సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులు

▸▸ నేడు పరిశీలించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 6: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులు వారం రోజులుగా వేగంగా కొనసాగుతున్నాయి. మండలంలోని సిరిపురం సమీపంలోని గోదావరినదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులను పరిశీలించడానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో వస్తున్నారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న రిపేర్ పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించిన అధికారులతో ఆరా తీయనున్నారు. అనంతరం భూపాలపల్లి జిల్లాలోని అన్నారం, మేడగడ్డ బ్యారేజీలను సందర్శించడానికి వెళ్లనున్నారు. సుందిళ్ళ బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు బ్యారేజీ ఎగువ, దిగువన సీసీ బ్లాక్‌ల రిపేర్ పనులను నవయుగ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బ్యారేజీ దిగువ ప్రాంతంలో సీసీ బ్లాక్‌లను రిపేర్‌తో సరిచేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో 3, 4, 5 బ్లాక్స్‌లో సీసీ గ్రేడింగ్ పనులను చేపట్టడానికి అందులో ఉన్న నీటిని తీసివేయటానికి కావాల్సిన పనులను నిర్వహిస్తున్నారు. 2022లో వచ్చిన భారీ వరదల కారణంగా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో కట్టకు ఒక వైపు గండి పడటంతో దాన్ని పూర్తిస్థాయిలో పూడ్చివేస్తున్నారు. ఈ పనులను మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సుందిళ్ల బ్యారేజీ సమీపంలో హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను అధికారులు చేశారు.


బ్యారేజీ దిగువ ప్రాంతంలో చేపడుతున్న సీసీ బ్లాక్ రిపేర్ పనులు

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

తిమ్మాపూర్, జూన్ 6: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానా స్పదంగా మృతి చెంది ఉన్నాడు. స్థానికులు, ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గునుకుల వెంకటరమణ(66)అనే వ్యక్తి సింగరేణిలో పదవి విరమణ పొందిన అనంతరం కుటుంబం తో కలిసి మండలంలోని మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా బుధవారం రాత్రి ఎల్‌ఎండీ కాలనీలో గల గెస్ట్ హౌస్ సమీపంలో అతడు ఆటోలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. తన భర్త మద్యం తాగి డీహైడ్రేషన్‌తో మరణించాడా, వేరే కారణలతో మృతి చెందాడా అని అనుమానం ఉందని వెంకటరమణ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, జూన్ 6: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు100 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన గురువారం తీర్పునిచ్చినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్దార్‌నగర్‌కు చెందిన బొట్ల వెంకటస్వామి అనే వ్యక్తికి రగుడు శివారులో ఉన్న భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి దానికి గేటును అమర్చారన్నారు. ఆ గేటును 3-8-2023 రోజున దొంగతనం చేశారని పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దొంగతనం చేసిన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గూడూరి కిరణ్‌కుమార్, మెహెర్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్‌పాషాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణ అనంతరం విచారణ అధికారి ఎస్‌ఐ మల్లేశం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. సీఎంఎస్‌ఎస్‌ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున చెలుమల సందీప్‌కుమార్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులైన గూడూరి కిరణ్‌కుమార్, షేక్ రియాజ్‌పాషాలకు ఏడాది శిక్షతో పాటు 100రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఐలుకొమురు(ఫైల్)

శంకరపట్నం, జూన్ 6: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆడితం ఐలుకొమురు (24) రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించిన వ్యాధి నయం కాలేదు. ఈ నెల 2న నొప్పి తీవ్రం కావడంతో వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఐలుకొమురును హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఐలుకొమురు తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇటుక బట్టి వద్ద ప్రమాదంలో చిన్నారి మృతి

మేడిపల్లి, జూన్ 6: మేడిపల్లి మండల కేంద్రంలోని వీఎస్‌ఆర్ ఇటుక బట్టి వద్ద జరిగిన ప్రమాదంలో నిఖిల్ పోద్ (18నెలలు) చిన్నారి మృతి చెందాడు. ఒరిస్సా రాష్ట్రంలోని పదాన్‌పల్లి గ్రామానికి చెందిన దశరథ్ పోద్ అతని భార్య సారతి పోద్ కలిసి మేడిపల్లిలోని ఇటుక బట్టిలో పనులు చేస్తున్నారు. నిఖిల్ అమ్మమ్మ బసంతి తనను పక్కన కూర్చోబెట్టుకుని పని చేస్తుండగా ట్రాక్టర్ వెనకనుంచి చిన్నారి తలకు తాకింది. గమనించిన యజమాని ప్రసాద్ చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు నిఖిల్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి సారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

ఎస్‌యూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్6: శాతవాహన విశ్వ విద్యాలయం ఎల్‌ఎల్‌బీ నాలుగో, ఆరో సెమి స్టర్, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్‌లకు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆయన పేర్కొన్నారు.

సబ్బితంవాసికి ఫార్మసీలో డాక్టరేట్

పెద్దపల్లి రూరల్, జూన్ 6 : మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన పులిపాక శంకరయ్యకు ఫార్మసీలో డాక్టరేట్ లభించింది. పంజాబ్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుండి డాక్టర్ ఆశిష్ సుత్తీ, డాక్టర్ ఎం.రవికుమార్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథం డెవలప్‌మెంట్, ఆప్టిమైజేషన్, క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో ఫార్ములేషన్స్ ఆఫ్ ఆల్పీనియా మ్యూటికా అండ్ ట్రేడ్‌స్కాంటియా స్పాథేసియా యాంటీ-డయాబెటిక్ యాక్టివిటీలో డాక్టరేట్ లభించింది. ఆయనకు డాక్టరేట్ లభించడం పట్ల గ్రామంలో ప్రజాప్రతినిధులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

సైడ్ రిటర్నింగ్ వాల్ నిర్మించాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 6 : పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్-దస్తగిరిపల్లి గ్రామాల మధ్య కరీంనగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిల్వకుండా రిటర్నింగ్ వాల్ నిర్మించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఎంపీటీసీ మిట్టపల్లి వసంత-వెంకటేషం వినతిపత్రం అందించారు. గతంలో రైల్వే బ్రిడ్జి నీరు నిల్వడంతో పలు ప్రమాదాలు జరిగాయని, రైల్వే అధికారులు చర్యలు చేపడుతున్నారు. కానీ ఆర్అండ్‌బీ అధికారులు సైతం రిటర్నింగ్ వాల్ నిర్మించేలా ఆదేశాలివ్వాలని వినతిలో కోరారు.

దొంగతుర్తిలో సీసీ కెమెరాల ఏర్పాటు

ధర్మారం,జూన్6: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. గ్రామస్తుల సహకారంతో గ్రామంలో ప్రధాన కూడళ్లో 16 సీసీ కెమెరాలను గురువారం ఎస్సై సత్యనారాయణ ప్రారంభం చేశారు. దొంగతనాల అరికట్టడం ఈ సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఆయన చెప్పారు.

పలు గ్రామాల్లో భూసార పరీక్షలు

సుల్తానాబాద్, జూన్ 6:సుల్తానాబాద్ సహకార సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో గురువారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సంఘ సీఈఓ బూరుగు సంతోష్‌కుమార్, కోరమాండల్ ఎరువుల కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే రాహుల్, సహకార శాఖ లెక్చరర్ శ్రీరామోజు వెంకటేశ్వర్లు, సహకార సంఘం డైరక్టర్లు ముద్దసాని సురేష్‌రెడ్డి, క్యాదాసి లచ్చయ్య, అధికారులు సాగర్, రాంబాబు పాల్గొన్నారు.

నియామకం

రామగిరి, జూన్ 6: మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా ముచ్చకుర్తి శ్రీనివాస్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర మున్నూరుకాపు సంఘం కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. తన పై నమ్మకంతో పదవి కల్పించిన మహేందర్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రామగిరి, జూన్ 6: మండలంలోని కార్పెంటర్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. గురువారం ఐలపురం బ్రహ్మాచారి ఆధ్వర్యంలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కార్పెంటర్ అసోసియేషన్ సమావేశానికి స్వామి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా పలువురు కార్పెంటర్‌లు వృత్తి సంబందిత సమస్యలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. సమస్యల పరిష్కరించేందుకు కృషి చేయాలని నాయకులను కార్పెంటర్‌లు కోరారు. సాధ్యమైనంత మేరకు కార్పెంటర్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని స్వామి హామీనిచ్చారు. లక్కేపురం శ్రీనివాస్, సదా నందం, భాస్కర్, శ్రీనివాస్, శివమణి, నరేంద్రచారి, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

'ప్రజలంతా బీజేపీ వైపే నిలిచారు'

జూలపల్లి, జూన్ 6 : మండలంలో మెజారిటీ ప్రజలంతా బీజేపీ వైపే నిలిచారని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పుల మహేష్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గుడిపాటి సంతోష్‌రెడ్డి, భూసారపు రవిందర్‌గౌడ్, బొప్పనపెల్లి మల్లేశం, బొజ్జ సంపత్, పొన్నం వెంకటేశ్‌గౌడ్, ఆవుల రాజు, కొమ్ము మహెందర్, సింగిరెడ్డి మహిపాల్ పలువురు పాల్గోన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

ఓదెల, జూన్ 6: మండలంలోని పలు గ్రామాలలో గురువారం గాలి వాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ప్రశాంతమైన వాతావరణం నెలకొని ఉండగా ఆకస్మత్తుగా మబ్బులుకమ్మి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఓదెలలో పిడుగుపాటుకు చింతల వెంకటస్వామి అనే రైతుకు చెందిన ఎద్దు మృతిచెందింది. రూ.80వేల మేరకు నష్టం వాటిల్లినట్లు రైతు వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సిబ్బంది ముందస్తుజాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రమాదాలను నివారించారు. ఉధృతంగా గాలివాన కురవడంతో వరి మొలక పోసుకున్న రైతులకు కొంత నష్టం వాటిల్లింది.

స్వప్న కాలనీలో దొంగతనం

సుల్తానాబాద్, జూన్ 6: సుల్తానాబాద్ పట్టణంలోని స్వప్న కాలనీలోని దన్నాయక్ అశ్విని అనే మహిళ ఇంట్లో దొంగతనం జరిగింది. గురువారం ఉదయం పదకొండున్నర ప్రాంతంలో అశ్విని తన తలుపులు దగ్గరకు వేసి పక్క ఇంటికి వెళ్లింది. పదిహేను నిమిషాల్లో తిరిగి ఇంటికి వచ్చిన అశ్విని తన ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించింది. ఒక చిన్న హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రెండు పుస్తెలు అర తులం బరువుగలవి, దాంతో పాటు ఎనిమిది వేల నగదు, బ్యాంకు పాస్‌బుక్, పలు ఏటీఎం కార్డులు ఎత్తుకెళ్లారని తెలిపింది. కుక్క అరవడంతో దొంగ పారిపోయాడని బాధితురాలు తెలిపింది.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కొరత

- తాగునీరు లేక అల్లాడుతున్న రోగులు - పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా ఉన్న వాటర్ కూలర్లు

కళ్యాణ్‌నగర్, జూన్ 6: గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కటకట ఏర్పడింది. రెండు రోజులుగా తాగటానికి మంచినీరు లేక రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వందలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వారికి కనీసం గుక్కెడు మంచినీటిని కూడా అందించలేని స్థితిలో ఆసుపత్రి అధికార యంత్రాంగం ఉంది. అసలు ప్రభుత్వాసుపత్రిలో పరిపాలన గాడితప్పడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో అన్ని వ్యవస్థలు చూడాల్సిన సూపరింటెండెంట్‌కు ఆరోగ్య సమస్య ఉండడంతో రోజూ ఆసుపత్రిలో జరిగే పనులను పర్యవేక్షించాల్సి ఉండగా అవి జరగడం లేదు. ఆ తరువాత ఉన్న ఆర్‌ఎంవోలు కూడా తమకు ఏమిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. తుతు మంత్రంగా విధులకు హాజరవుతూ సమయం కాగానే వెళ్లిపోతున్నారు. ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనేది పట్టించుకునేవారు కరువయ్యారు. గురువారం తాగునీరు లేక రోగులు బయటకు వెళ్లి మంచినీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. పాత బిల్డింగ్‌లో ఓపీ వద్ద ఎన్‌టీపీసీ సహకారంతో వాటర్ కూలర్ ఏర్పాటు చేసిన ఆ వాటర్ కూలర్ పనిచేయడం లేదు. రోగులు అక్కడున్న వారిని తాగునీరు వస్తలేదని చెప్పినా పట్టించుకునే వారు లేరు. ధర్మాసుపత్రిలో పాలన గాడి తప్పింది. ఎవరికి వారు యమునా తీరం అనే విధంగా కొనసాగుతోంది. ఆసుపత్రిలో ఏ విభాగంలో ఎవరెవరు పని చేస్తున్నారో, ఎక్కడ పని చేస్తున్నారో, ఎంత మంది పని చేస్తున్నారో అనే లెక్కలు కూడా లేవు. ఇటీవల 13 మంది పారిశుధ్య విభాగానికి చెందిన వారిని నియమించారు. వీరెక్కడ పని చేస్తున్నారనేది కూడా తెలియదు. మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిని రెండు కూడా ప్రిన్సిపాలే చూడడం, ప్రిన్సిపాల్‌కు కూడా ఒత్తిడి పెరగడం, ఇటు కాలేజీలో, అటు ఆసుపత్రిలో పాలన చేయడం కష్టతరంగా మారింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు కనీసం తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి ఏర్పడింది. పాలన విషయంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జనరల్ ఆసుపత్రిలో సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైన ఉన్న కార్యాలయాల్లో ఆసుపత్రి సిబ్బందికి బయట నుంచి నీటిని సమ కూర్చు తూ రోగులను మాత్రం గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బడిబాట కార్యక్రమం ప్రారంభం



భోజన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఎలిగేడులో బడిబాట ర్యాలీ..

పెద్దపల్లిటౌన్, జూన్ 6: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం గురువారం నుంచి తలపెట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లిలోని అమర్‌నగర్, ప్రగతినగర్ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఇంటిలోని బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్చుకోవడంతోపాటు బడిబాటతో పాటు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ తల్లిదండ్రుల చేతుప్రతిజ్ఞ చేయించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంజులత, రమాదేవి, సీఆర్పీ బాలసాని వెంకటేశం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు, తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భోజన్నపేటలో నిర్వహించిన బడిబాట ప్రారంభ కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్ పాల్గొన్నారు. వారి వెంట ఎంపీటీసీ మేకల రాజేశ్వరి-శ్రీనివాస్, ఈజీఎస్ జేఈ రాజయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు. అలాగే రాఘవపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు ఆధ్వర్యంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, అంగన్‌వాడి టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎలిగేడు : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని హైస్కూల్ హెచ్ఎం గంధ్ర దేవేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ నుండి అంబేద్కర్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5నుంచి 15ఏళ్ల బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. ఈనెల 19వరకు బడిబాట కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, పాఠశాలల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్ఎంలు సునీత, ఈర్ల సమ్మయ్య అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బడి ఈడు పిల్లల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆంగ్ల ఉపాధ్యాయుడు కూరపాటి సత్య ప్రకాశరావు ముద్రించిన కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. మంచి బోధన, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం అన్ని సౌకర్యాలతో బోధన జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషన్ షాపులో విజిలెన్స్ తనిఖీలు

- 6.2 క్వింటాళ్ల అదనపు స్టాక్ గుర్తింపు - షాప్ సీజ్

కోల్‌సిటీ, జూన్ 6: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బియ్యం అక్రమ దందా జరుగుతుందనే ఫిర్యాదు నేపథ్యంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహిస్తుంది. గురువారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని 17నెంబర్ షాపులో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. తనిఖీల్లో ఈ-పాస్ రికార్డుకు అదనంగా 6.2క్వింటాళ్ల బియ్యం స్టాక్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. డీఎస్ఓ ప్రేమ్‌కుమార్, సివిల్‌సప్లై ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రావులకు సమాచారం ఇచ్చారు. వారు షాపుపై 6ఏ కేసు నమోదు చేసి సీజ్ చేశారు. రామగుండం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు స్టాకు, యంత్రాలను అప్పగించారు.



రేషన్‌షాపులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పంపిణీకి సిద్ధమవుతున్న విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్



తుర్కలమద్దికుంటలో యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ పంపిణీకి సిద్ధమవుతున్నాయి. వాటిని కుట్టే పనిని ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి గురించి ఆలోచించి దుస్తులు కుట్టే పనిని వారికి అప్పగించింది. జూన్ 10వ తేదీలోపు పాఠశాలలకు దుస్తులు అందేలా వీవోలు ప్రణాళికలు రూపొందించారు. మండలంలోని 30గ్రామపంచాయతీల్లో 54 ప్రభుత్వ పాఠశాలల్లో 1331మంది బాలురు, 1331మంది బాలికలు మొత్తం 2662 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి విద్యార్థికి ఒక జత చొప్పున యూనిఫాం కుడుతున్నారు. ఒక జతకు రూ.75 కుట్టు కూలీ ఇస్తున్నారు. విద్యార్థులకు సరిపడా దుస్తులు కుట్టేందుకు 5క్లస్టర్‌లను ఏర్పాటు చేశారు. తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, రాగినేడు, భోజన్నపేట, సబ్బితం గ్రామాల్లో క్లస్టర్‌ల వారిగా ఏర్పాటు చేశారు. జూన్ 10వరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు ఏపీఎంలు తెలిపారు. మహిళలు యూనిఫాంలను అందించేందుకు మహిళ సంఘాల సభ్యులు పనిలో నిమగ్నమయ్యారు.



ఉద్యోగుల సంక్షేమం, రక్షణపై దృష్టి

- కొత్త ప్రాజెక్టులు, నూతన కార్యక్రమాల అమలుకు ప్రత్యేక కార్యాచరణ - సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 6: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున ఇకపై సింగరేణిలో పాలన పరుగులు పెట్టాలని, కోడ్ నేపథ్యంలో నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో 25పైగా శాఖల అధిపతులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, కొత్త కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఈ విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని సీఎండీ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణాలపైనే నెలవారీగా సమీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇకపై రక్షణ, సంక్షేమంతో పాటు ఇతర అన్ని విభాగాల పనితీరుపైనా నెలవారీగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా విభాగాలకు అప్పగించిన పనుల పురోగతిని నెలవారీగా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ రంగంతో పోటీ పడేలా మన సామర్థ్యాలను, ఆలోచన విధానాలను మార్చుకొని ముందుకు సాగాలన్నారు. సింగరేణి వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని, అందరు అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగా సకాలంలో నిర్వహిస్తే సంస్థను దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టవచ్చునని వివరించారు. ముఖ్యంగా పని గంటల వినియోగంతో పాటు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమన్నారు. విధుల పట్ల అలసత్వం, లక్ష్యాల సాధన పట్ల నిర్లక్ష్యం చూపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని సీఎండీ స్పష్టం చేశారు. ప్రతి నెలా ఆయా విభాగాల పనితీరులో మెరుగుదల కనిపించక పోయినా, అప్పగించిన పనులను పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. అదే సమయంలో సంస్థ ఉన్నతికి అంకిత భావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఇస్తామన్నారు. ఉత్పత్తితోపాటు సంక్షేమం, రక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, రక్షణ విషయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగానికి ఖర్చుకు వెనకాడకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈ సందర్భంగా సీఎండీ గుర్తు చేశారు. కంపెనీ అభివృద్ధికి ఇచ్చే మంచి సూచనలను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రక్షణ, సంక్షేమం, వైద్యం, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎక్స్‌ప్లోరేషన్, ఎస్టేట్స్, విజిలెన్స్ తదితర 32శాఖల పనితీరును ఆయా విభాగాల వారీగా కూలంకశంగా సమీక్షించారు.

ఈ సమీక్ష సమావేశంలో కొత్తగూడెం ఏరియా నుండి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్, పర్సనల్) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (ఈఅండ్ఎం)డీ సత్యనారాయణ రావు, జీఎం(కో ఆర్డినేషన్) జీ దేవేందర్‌తో పాటు కార్పొరేట్‌లోని వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

హైపవర్ వేతనాలు అమలు చేయాలి

- కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు అశోక్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 6: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలను అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. సివిక్ జోన్‌లో గురువారం జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, 2013 నుండి కోల్ ఇండియాలో హైపవర్ కమిటీ ప్రతిపాదించిన వేతనాలు అమలు అవుతున్నా, ఇప్పటి వరకు సింగరేణి యాజమాన్యం అమలు చేయలే దని అన్నారు. వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో 2023 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మె జరగగా, సింగరేణి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించినట్టు అశోక్ తెలిపారు. 22వ జీఓను గెజిట్ చేయడం లేదా హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాల్లో ఏదైనా అమలుచేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్టు పేర్కొన్నారు. కానీ యాజమాన్యం సమ్మె విచ్ఛిన్నం చేయడానికే హామీ ఇచ్చిందని, ఇప్పటికీ వాటిని అమలు చేయలేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులక ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. రమేష్, దుర్గేష్, లింగయ్య, శంకరమ్మ, నగేష్, సుభద్ర పాల్గొన్నారు.

విధులకు తప్పనిసరిగా హాజరుకావాలి

శ్రీరాంపూర్, జూన్ 6: గైర్హాజరీ కార్మికులు విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. గైర్హాజరీ కార్మికులకు జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు 2021నుంచి 2023వరకు ఒక్క మస్టర్ కూడా చేయని వారున్నారని, వారు ఇప్పటినుంచైనా నెలకు 20మస్టర్ల చొప్పున చేయాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి తదితరులున్నారు.

కౌలు వేలం పాటను బహిష్కరించిన రైతులు



ఓదెలలో వేలం పాట నుంచి వెళ్లిపోతున్న రైతులు

ఓదెల, జూన్ 6: మండల కేంద్రంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూముల కౌలు వేలం పాటను రైతులు బహిష్కరించారు. ఇక్కడి సీతారామ చంద్రస్వామి ఆలయంలో పూజారిని నియమించే వరకు ఈవేలం పాట వద్దని రైతులు తెలిపారు. ఆలయంలో పూజారికి దూప దీప నైవేద్యం కింద చెల్లించవలసిన వేతనం ఇవ్వకుండా పూజారిని నియమించకుండా ఆలయ పరిధిలోని 5 ఎకరాల భూమి కౌలుకు ఎందుకు ఇస్తున్నారని రైతులు ఈవోను ప్రశ్నించారు. చివరికి ఆలయంలో పూజారి నియామకం, వేతన చెల్లింపు కోసం చర్చిస్తుండగా గతంలో పూజలు నిర్వహించిన అర్చకుడినే నియమించాలని డిమాండ్ చేశారు. భూములను ఎవరూ కౌలుకు తీసుకోవద్దని, ఒకవేళ ఎవరైనా ముందుకు వస్తే సాగు చేయనివ్వబోమని రైతులు తెలపడంతో వేలం కోసం డిపాజిట్ చేసిన సొమ్మును ఓ రైతు తిరిగి తీసుకున్నాడు. దీంతో వేలం వాయిదా వేసినట్లు ఈవో సదయ్య, ఇన్‌స్పెక్టర్ సుజాతరెడ్డి తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న వృక్షం తొలగింపు

పెద్దపల్లి రూరల్, జూన్ 6: పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని గురువారం గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే దారిలో ప్రధాన రహదారికి ఆనుకొని వృక్షం బుధవారం సాయంత్రం నిప్పు అంటుకోగా ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందడంతో ఆంధ్రజ్యోతిలో ఎండిపోయిన వృక్షానికి నిప్పు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. గురువారం స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించారు.

ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, జూన్ 6: సుల్తానాబాద్ పట్టణంలో పేదలకు ఉచితంగా గుండె సంబంధిత పరీక్షలతో పాటు, మహిళలకు పరీక్షలను నిర్వహించారు. జిల్లా పద్మశాలి అడ్‌హక్ కమిటీ వారి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి కళాశాలలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ వల్స నీలయ్య, డాక్టర్లు వేముల సత్యనారాయణ, ప్రతిష్టారావు, శిబిరం నిర్వాహక ప్రతినిధి గుర్రం కిరణ్, సంఘ ప్రతినిదులు పెగడ చందు, మూర్తి, కరుణాకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కళ్యాణ్‌నగర్, జూన్ 6: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈనెల 4న ఖమ్మం జిల్లాలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించిన రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన నిహారిక, గౌస్, కార్తికేయ (గోల్డ్‌మెడల్), విష్ణువర్ధన్(సిల్వర్)ను గురువారం సీఐ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు రాజేశం, రాములు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'టీబీ నిర్మూలన ధ్యేయంగా పనిచేయండి'

ఎలిగేడు, జూన్ 6: క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు నిస్సిక్రిష్టాన అన్నారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలలో గురువారం ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు ఒకరోజు అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్‌పై శిక్షణ అందించారు. 18ఏళ్లు పైబడిన వయోజనులకు బీసీజీ వాక్సిన్ క్షయవాధిని పూర్తిగా నివారిస్తుందని పేర్కొన్నారు. అడల్ట్ టీబీ కంపెయిన్ మూడు నెలల పాటు కొనసాగిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టీబీ వైద్య సూపర్‌వైజర్ సురేందర్, హెల్త్ ఎడ్యుకేట్ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, నాగమరి, పలు గ్రామాల ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

కళ్యాణ్‌నగర్, జూన్ 6: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, సరోజన దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గురువారం స్థానిక ఇందిరానగర్‌లో పేదలకు దుస్తులను ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు గుమ్మడి కుమారస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేక్ ఎంపీగా ఉన్నప్పుడు పెద్దపల్లి పార్లమెంట్‌ను అభివృద్ధి పథంలో నడిపించారని, ఈ ఎన్నికల్లో గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించిన రామగుండం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో ఎంపీ నిధులతో రామగుండం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వంశీ హామీ ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. తాళ్లూరి పవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వంగ లక్ష్మీపతి, పంజా శ్రీనివాస్, సదానందం, సూర్య, కొమురయ్య, అశోక్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్, జూన్ 6: విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. సుల్తానాబాద్ మండలంలోని మారుతినగర్‌కు చెందిన నూనె కనుకయ్య తన నాలుగు గేదెలను పొలం వద్ద మేపుకుని తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా అక్కడ తెగిపడి ఉన్న కరెంట్ వైరును గమనించక దాన్ని తాకడం వలన రైతుతో పాటు నాలుగు గేదెలు కూడా మృతి చెందాయి. దాంతో గురువారం ఉదయం ఎమ్మెల్యే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని రైతు మృతదేహాన్ని సకాలంలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేయించారు. మారుతినగర్ లో మృతుని కుటుంబసభ్యులను బంధువులను పరామర్శించారు. జడ్పీటీసీ స్వరూప మినుపాల ప్రకాష్‌రావు, తాజా మాజీ సర్పంచ్ పోలు అంజయ్య, నాయకులు మీస సత్తన్న, ఇల్లందుల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్ ఉన్నారు.

కనగర్తి విద్యార్థికి అథ్లెటిక్‌లో గోల్డ్‌మెడల్

ఓదెల, జూన్ 6: ఓదెల మండలం కనగర్తి దాసరి పద్మ-హన్మయ్య జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముద్దమళ్ల అజయ్ అథ్లెటిక్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. హన్మకొండ వేదికగా జరిగిన 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో బాల, బాలికల కోసం వేసవి సెలవుల్లో అథ్లెటిక్ క్యాంపు నిర్వహించగా నెల రోజుల పాటు శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయి క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ క్యాంపు ద్వారా గ్యావెలింగ్ త్రో, లాంగ్ జంప్, రన్నింగ్ శిక్షణ కోసం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మెళకువలు నేర్పించారు. పీఈటీ విష్ణుసాగర్, డివైఎస్‌వో సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విజేతను అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాసరెడ్డి(ఫైల్)

ఓదెల, జూన్ 6: ఓదెల మండలంలోని జీలకుంట గ్రామంలో గురువారం రాత్రి నల్ల శ్రీనివాసరెడ్డి(40) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఇంటిలో ఉక్కపోస్తుండడంతో కూలర్ స్విచ్ ఆన్ చేశాడు. ఫ్యాన్ తిరగకపోవడంతో కూలర్‌ను ముట్టుకొని పరిశీలిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడు శ్రీనివాస రెడ్డికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.